క్లుప్తంగా

నేడు సర్వసభ్య సమావేశం

తాండూరు రూరల్: ఎల్మకన్నె ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించనున్నట్లు సీఈఓ శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సొసైటీ చైర్మన్ సంగెం రవిగౌడ్ ఆధ్వర్యంలో ఉదయం 11 గంటలకు జరిగే ఈ సమావేశానికి డైరెక్టర్లు, రైతులు రావాలని కోరారు.

27న తట్టెపల్లిలో..

పెద్దేముల్: ఈ నెల 27న తట్టెపల్లి పీఏసీఎస్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు సీఈఓ చంద్రమౌళి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం నిర్వహించే ఈ సమావేశానికి సొసైటీ చైర్మన్ లక్ష్మారెడ్డి పాల్గొంటారని తెలిపారు.

దళిత ఉపసర్పంచ్‌పై దాడి


నిరసన వ్యక్తంచేసిన కేవీపీఎస్



నిరసన వ్యక్తం చేస్తున్న కేవీపీఎస్ నాయకులు

బొంరాస్‌పేట: ప్రజాప్రతినిధులుగా ఉండి గ్రామస్థాయిలో సేవలు అందిస్తున్న దళిత ఉపసర్పంచుపై దాడి చేయడం తగదని కుల నిర్మూలన పోరాట సమితి(కేవీపీఎస్) సంఘం నాయకులు అన్నారు. నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలం పీడంపల్లి గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ హుసేనప్పపై దాడి చేసిన దుండగులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, శిక్షించాలని సంఘం మండల అధ్యక్షుడు అంజిలయ్య డిమాండ్ చేశారు. ఇందులో ఉపాధ్యక్షుడు బలరామ్, ప్రధాన కార్యదర్శి అంజి, నాయకులు భీమయ్య, సందప్ప, నర్సయ్య, ఆశప్ప, ప్రవీణ్, అమృతప్ప ఉన్నారు.

కొనసాగుతున్న బీటీరోడ్డు నిర్మాణం



ప్రారంభమైన దోర్నాల్‌పల్లి బీటీరోడ్డు పనులు

దోమ: గొడుగోనిపల్లి నుంచి దోర్నాల్‌పల్లి మీదుగా దొంగ ఎన్కేపల్లి వెళ్లే రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో బీటీరోడ్డు నిర్మాణ పనులకు సంబంధిత అధికారులు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా డస్ట్, కంకర పోసి చదును చేస్తున్నారు. రోడ్డు పూర్తయితే ప్రయాణం సాఫీగా సాగుతుందని పరిసర ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వృథాగా వ్యర్థ పదార్థాల షెడ్లు




పోచమ్మ తండాలో నిర్మించిన షెడ్డు

కొడంగల్: ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ కొరకు నిర్మించిన షెడ్లు నిరుపయోగంగా మారాయి. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా ఒక్కో షెడ్డుకు రూ.2,54,427 వెచ్చించి నిర్మించారు. గ్రామాల్లో సేకరించిన చెత్తను షెడ్ల దగ్గరకు తెచ్చి వేరు చేయాల్సి ఉంటుంది. తడి పొడి చెత్తను వాటి కోసం నిర్మించిన షెడ్లలో వేయాలి. గాజు, ప్లాస్టిక్ బాటిల్స్, చెప్పులు, పేపర్ అట్ట ముక్కలు, బల్బులు, ఎలక్ట్రిక్ పరికరాలు, బ్యాగులు, బట్టలు ఇతర వ్యర్థాలను వేరు చేసి వేయాలి. వీటి కోసం నిర్మించిన షెడ్లు ఊరికి దూరాన ఉండటంతో అవి వృథాగా మారినట్లు స్థానికులు చెప్పారు.

మండపంలో రక్తదానం

అనంతగిరి: గణేశ్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని వికారాబాద్ పట్టణంలోని శివారెడ్డి పేట్ హనుమాన్ మందిరంలో ప్రతిష్ఠించిన వినాయకుని వద్ద బాల వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరికలు



బీజేపీలో చేరిన తండావాసులు

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం గోవులబండతండా, చింతకుంటతండాల్లో వివిధ పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు బీజేపీలో చేరారని ఆ పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు కుర్మయ్య తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీవర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య బీజేపీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో దశరథ్, రెడ్యా నాయక్, చందర్, కిషన్, రవి, సేవ్యానాయక్, గోపాల్, శాంతాబాయి, శిరీష ఉన్నారు.

మూడేళ్ల ముచ్చటే!

- పనిచేయని వాటర్ ఫిల్టర్స్
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- పల్లెప్రజలకు అందని శుద్ధజలం
- బోరు నీటితో సరిపెట్టుకున్న జనం

పెద్దేముల్: పట్టణ, పల్లె ప్రాంత ప్రజలకు తాగడానికి శుద్ధి జలాలు అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన వాటర్ ఫిల్టర్లు మూడేళ్ల ముచ్చటగానే మారాయి. మరమ్మతు చేయించాల్సిన అధికారులు పట్టించుకోకపోవటంతో అవి మూలనపడ్డాయి. దీంతో రూ.లక్షలు వృథా అయ్యాయి. ఫలితంగా పరిసర ప్రాంత ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు కరువవడంతో మిషన్ భగీరథ, వ్యవసాయ బోరు బావుల నీటితో సరిపుచ్చుకుంటున్నారు. ఇదే విషయాన్ని గ్రామ సభలు, సమావేశాల్లో పాలకులకు, అధికారులకు ఫిర్యాదు చేసినా.. ఫలితం లేదని బాధిత గ్రామీణ ప్రాంత వాసుల ఆరోపణలు.

ఒక్కో జీపీకి రూ.2.5లక్షలు

ప్రతి ఒక్కరికీ స్వచ్ఛమైన మినరల్ వాటర్ అందించాలన్న లక్ష్యంతో మండల పరిధి 35 గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం మూడేళ్ల క్రితం 'ప్రధాన మంత్రి ఖనిజ క్షేత్ర కళ్యాణ్ యోజన' పథకం కింద తాగునీటి శుద్ధి కేంద్రాలను మంజూరు చేసింది. కానీ అధికారుల నిర్లక్ష్యంతో అది నీరుగారి పోతోంది. నిర్వహణ లోపంతో వాటర్ ఫిల్టర్ యంత్రాలు నిరుపయోగంగా మారాయి. ఒక్కో జీపీకి సుమారు రూ.2.5లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన మిషన్లు పాడవటంతో ప్రజాధనం వృథా అయిందని పలువురు ఆవేదన వ్యక్తంచేశారు. పెద్దేముల్, మారేపల్లి, ఇందూరు, నాగులపల్లి, కందనెల్లి, గాజీపూర్ గ్రామాల్లో నీటి శుద్ధి కేంద్రాలు కొనసాగుతున్నాయి. మిగతా ప్రాంతాల్లో పట్టించుకునే వారు లేకపోవడం, పెట్టుబడులు పెట్టలేక పంచాయతీ కార్యదర్శులు చేతులు ఎత్తేయడంతో ఆ యంత్రాలు నిరుపయోగంగా మారాయి.



నిరుపయోగంగా మారిన వాటర్ ఫిల్టర్ (ఇన్‌సెట్‌లో) శుద్ధి కేంద్రం అంచనా విలువ

నిర్వహణ లోపం



ప్రభుత్వం మారుమూల ప్రాంతాల్లో నీటిశుద్ధి కేంద్రాలు ఏర్పాటు చేయడం ఎంతో సంతోషంగా ఉంది. కానీ.. గ్రామాల్లో నిర్వహణ చాలా కష్టం. ఎవరికైనా కాంట్రాక్టు ఇవ్వాలన్నా.. ముందుకు రావటం లేదు. ఇప్పటికే రూ.10వేలు ఖర్చు పెట్టాం. యంత్రం పనిచేయకపోవటంతో ఇతర గ్రామాల నుంచి మినరల్ వాటర్ తెచ్చుకుంటున్నారు.

– గోవర్ధన్, సర్పంచ్, మధనంతపూర్

బాగుచేయించాలి



పల్లెల్లో పాడైన వాటర్ ఫిల్టర్లను బాగుచేయించాలి. గ్రామీణులకు శుద్ధి జలాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. అప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుంది. ఈ విషయాన్ని గ్రామ సభల్లో అధికారులకు ఫిర్యాదు చేయాలన్నా.. వారు రావడం లేదు. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలి.

– నర్సింహులు, హన్మాపూర్

చర్యలు తీసుకుంటాం



నీటి శుద్ధి యంత్రాలు ఎక్కడ పనిచేస్తున్నాయి. ఎక్కడ పనిచేయడం లేదనే విషయాన్ని జీపీ కార్యదర్శులతో మాట్లాడి తెలుసుకుంటా. ఇంత వరకు ఏ గ్రామంలో మిషన్లు పనిచేయడం లేదన్న విషయం తమ దృష్టికి రాలేదు. సర్వే చేయించి, సంబంధిత అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటాం. స్వచ్ఛమైన తాగునీటి అందేలా కృషి చేస్తాం.

– లక్ష్మప్ప, ఎంపీడీఓ, పెద్దేముల్

పారిశుద్ధ్య మెరుగుకు స్పెషల్ డ్రైవ్

- తడిపొడి చెత్తను వేరుచేసి ఇవ్వండి
- పరిసరాల పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలి
- మున్సిపల్ మేనేజర్ నరేందర్ రెడ్డి

తాండూరు టౌన్: పరిసరాల పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ మేనేజర్ నరేందర్ రెడ్డి కోరారు. ఆదివారం ఇండియన్ స్వచ్ఛత లీగ్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలో పారిశుద్ధ్య ప్రత్యేక డ్రైవ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అక్టోబర్ 2వ తేదీ వరకు పట్టణంలో స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహిస్తామని చెప్పారు. ఇందులో భాగంగా మురికి కాలువల్లో పేరుకు పోయిన చెత్త, వీధుల్లో వేసిన చెత్తాచెదారం తొలగించడంతో పాటు బ్లీచింగ్ పౌడర్ చల్లడం, ఫాగింగ్ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఇందుకు ప్రజలు సహకరించాలన్నారు. చెత్తను వీధుల్లో వేయరాదని, తడి, పొడి చెత్తను వేరు చేసి, మున్సిపల్ వాహనాలకు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్విరాన్ మెంటల్ ఇంజినీర్ ప్రవీణ్ గౌడ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కృష్ణయ్య, వెంకటయ్య, జవాన్లు శ్రీనివాస్, వెంకటేశ్, కార్మికులు పాల్గొన్నారు.



వీధుల్లో చెత్తను తొలగిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

ఖాజీ కార్యాలయం ప్రారంభం

కొడంగల్: ప్రభుత్వ గుర్తింపు పొందిన ఖాజీ (ముస్లింల వివాహాలు నిర్వహించే గురువు) కార్యాలయాన్ని శనివారం రాత్రి పట్టణంలో ఎంఐఎమ్ కొడంగల్ నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్‌బీ గుల్షన్, మాజీ ఉప సర్పంచ్ గౌసన్, మత పెద్దలు మోసిన్ బాబా, మహమ్మద్, సలీం ప్రారంభించారు. ముస్లిం సామాజిక వర్గానికి చెందిన వారి వివాహాలు చేయడానికి ప్రభుత్వం తనను నియమించిందని ఖాదీ షేక్ అదిల్ తెలిపారు. ఇందులో సయ్యద్ ఇసాక్, అజ్మీర్, ఖాసీం, యూసుఫ్, నజీర్, కరీం ఉన్నారు.



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

భక్తిభావం పెంపొందించుకోవాలి



మున్సిపల్ చైర్మన్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

కొడంగల్: ప్రతిఒక్కరూ భక్తిభావం పెంపొందించుకోవాలని మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని తెలుగుగేరిలోని వినాయకుడిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన్ను ఉత్సవ కమిటీ సభ్యులు సన్మానించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఇందులో మిఠాయి రాజు, ఊట్కూరు రాజు తదితరులు పాల్గొన్నారు.



కుల్కచర్లలో..

కుల్కచర్లలో..

కుల్కచర్ల: అంగడిబజార్‌లో రజక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపయ్యను డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి తదితరులు దర్శించుకొని పూజలు చేశారు. ఇందులో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మోత్కూరు వెంకటేశ్, మండల నాయకులు రాములు, కుల్కచర్ల ఎంపీటీసీ ఆనందం, నాయకులు వెంకటయ్య, లక్ష్మయ్య, సురేష్, వెంకటయ్య, భీమయ్య, రాజు ఉన్నారు.

రోడ్డుపై గుంత.. ఆదమరిస్తే అంతే

- రహదారిపై గోతులు
- పట్టించుకోని అధికారులు
- రెండు జిల్లాల నడుమ నలిగిపోతున్న మరికల్, కల్మన్‌కాల్వ గ్రామస్తులు



మరికల్-కల్మన్‌కాల్వ రోడ్డుపై ఏర్పడిన గుంత

కుల్కచర్ల: రహదారుల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరంతరం పాటుపడుతున్నాయని చెప్పుకునే అధికారులు, ప్రజాప్రతినిధులు.. నిత్యం రద్దీగా రోడ్డులో పెద్ద గుంత ఏర్పడినా ఎవరూ పట్టించుకోవటం లేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. చౌడాపూర్ మండలం మరికల్ గ్రామం నుంచి కల్మన్‌కాల్వ గ్రామానికి వెళ్లే రహదారి మధ్యలో పెద్దగుంత ఏర్పడి వాహనదారులకు ఇబ్బందిగా మారింది. ఎప్పుడు ఎవరు ఆ గోతిబారిన పడతారోనని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. మరికల్ నుంచి కల్మన్‌కాల్వకు వెళ్లేందుకు 2కిలో మీటర్ల మేర ఉన్న బీటీరోడ్డుకు అక్కడక్కడా భారీ మలుపులతో పాటు, గుంతలు, రంధ్రాలు ఏర్పడి ప్రమాదకరంగా ఉంది. దీంతో కొందరు పెద్ద గుంత ఏర్పడిన చోట బాటసారులు గుర్తించటానికి చెట్టుకొమ్మ, ఒక సంచిని ఏర్పాటు చేశారు.

రెండు జిల్లాల మధ్య..

ప్రస్తుతం మరికల్, కల్మన్‌కాల్వ గ్రామపంచాయతీలు నూతనంగా వికారాబాద్ జిల్లా పరిధిలో చేరినప్పటికీ.. రికార్డుల ప్రకారం మహబూబ్‌నగర్ జిల్లా నవాబుపేట మండల పరిషత్‌లో ఉండటంతో అక్కడి అధికారులు పట్టించుకోవటం లేదు. అధికారికంగా పూర్తి అధికారం లేక జిల్లా అధికారులు ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారు. రెండు జిల్లాల పరిధిలో ఉన్న తమ గ్రామాల సమస్యలు పరిష్కారం కావడం లేదని బాధిత గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా ఏదైనా ప్రమాదం జరగకముందే సంబంధిత అధికారులు స్పందించి, రోడ్డుకు మరమ్మతు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

అడుగడుగునా గుంతలే..

వికారాబాద్ అర్బన్: మున్సిపల్ పరిధి రిక్షా కాలనీ, అటవీశాఖ కార్యాలయం సమీపంలో రోడ్డు పూర్తిగా ధ్వంసం అయింది. దారి పొడవునా గుంతలు, ఆపై భారీ మలుపులు ఉండటంతో వాహనదారులకు ఇబ్బందిగా మారింది. వర్షం కురిసిన సమయంలో గోతుల్లో నీరు నిలిచి ప్రమాదాల బారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు చొరవ చూపి, రోడ్డుకు మరమ్మతు చేయించాలని ప్రాంత వాసులు కోరుతున్నారు.



రిక్షా కాలనీ సమీప రోడ్డులో ఏర్పడిన గుంతలు

పల్లెల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత

ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

షాద్‌నగర్: పల్లెల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం కంసాన్‌పల్లి, వెంకట్‌రెడ్డిపల్లి, గిరాయిగుట్ట తండా, పుల్చర్లకుంట తండాల్లో రూ.1.41కోట్లతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక పల్లెలు అన్ని రంగాల్లో గణనీయమైన ప్రగతి సాధిస్తున్నాయని అన్నారు. జాతీయ స్థాయిలో గ్రామ పంచాయతీలు అభివృద్ధిలో పోటీపడి అవార్డులు సొంతం చేసుకుంటున్నాయని తెలిపారు. పల్లెల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు మంజూరు చేస్తోందని చెప్పారు. గ్రామ పాలనను పటిష్ఠం చేసేందుకు ప్రభుత్వం నూతన పంచాయతీరాజ్ చట్టాన్ని తీసుకొచ్చిందని వెల్లడించారు. సర్పంచ్ బసిరెడ్డి పద్మ, మాజీ వైస్ ఎంపీపీ బసిరెడ్డి నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్‌లో స్వచ్ఛతా హీ సేవ..

షాద్‌నగర్ మున్సిపాలిటీలో స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పాత జాతీయ రహదారి పక్కన పారిశుద్ధ్య పనులు చేపట్టే కార్యక్రమం ప్రారంభించారు. పట్టణంలోని ఎన్‌జీఓస్, కాలనీలో రూ.10లక్షలతో నిర్మించిన పార్కు ప్రహరీని ప్రారంభించారు. అదే విధంగా రూ.10లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నరేందర్, వైస్ చైర్మన్ ఎంఎస్ నట్‌రాజన్, విశ్వం, పావని, నర్సింహ్మా, చింటు, యుగేందర్, నందకిషోర్, కమిషనర్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

గ్రామకమిటీ ఎన్నిక

కుల్కచర్ల: బడుగుబలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడేది కాంగ్రెస్ పార్టీ ఒక్కటేనని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు అన్నారు. ఆదివారం కుల్కచర్ల మండలం లాల్‌సింగ్ తండాలో పార్టీ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా ఎం.గోపాల్ నాయక్, ప్రధాన కార్యదర్శిగా తులసీరాం, ఉపాధ్యక్షుడిగా రాములునాయక్, యువజన విభాగం అధ్యక్షుడిగా సురేష్, మహిళా అధ్యక్షురాలిగా రమణమ్మ, ప్రధాన కార్యదర్శిగా గోవిందమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, మాజీ అధ్యక్షుడు పెంటమీది వెంకటయ్య, ఎంపీటీసీ ఆనందం, మైనార్టీ విభాగం నాయకులు షర్ఫొద్దీన్, మండల ఉపాధ్యక్షుడు కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

తాండూరు టౌన్: 29 ఏళ్ల క్రితం పదో తరగతి అనంతరం విడిపోయిన మిత్రులందరూ ఒక్కటయ్యారు. బాల్యంలో చేసిన అల్లరి పనులు, ఉపాధ్యాయుల బెత్తం దెబ్బలను గుర్తు చేసుకుంటూ ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. తాండూరు పట్టణంలోని సరస్వతీ శిశు మందిర్‌లో 1994–95లో పదో తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులంతా ఆదివారం స్థానిక ఓ హోటల్‌లో కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. పాఠాలు బోధించిన గురువులను స్మరించుకున్నారు. ఆద్యంతం సందడిగా గడిపారు.



పూర్వ విద్యార్థులు

కుటుంబ పోషణ కష్టమైంది..

- దశాబ్దాలుగా పనిచేస్తున్నా గుర్తింపులేదు
- ఉద్యోగ భద్రత కల్పించి ఆదుకోండి
- కనీస వేతనం అమలుచేయాలి
- నిరవధిక సమ్మెలో అంగన్‌వాడీల ఆవేదన



వర్షంలో తడుస్తూ సమ్మె కొనసాగిస్తున్న అంగన్‌వాడీలు

అనంతగిరి: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, సహాయకులు యూనియన్ (సీఐటీయూ అనుబంధం) ఆధ్వర్యంలో చేస్తున్న నిరవధిక సమ్మె ఆదివారంతో 14వ రోజుకు చేరుకుంది. వారి నిరసనతో రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాలు మూతపడగా.. ప్రభుత్వం నుంచి సమ్మెవిరమించి, విధుల్లో చేరాలనే ఒత్తిడి వస్తోంది. ఈ నేపథ్యంలో పలువురు మాట్లాడారు. దశాబ్దాలుగా ఎదుగూబొదుగూ లేకుండా ఐసీడీఎస్‌లో పనిచేస్తున్నా.. ప్రభుత్వం తమను గుర్తించడం లేదని చెప్పారు. చాలీచాలని వేతనాలతో కుటుంబ పోషణ కష్టమైందని తెలిపారు. తమిళనాడు, పాండిచ్చేరిలో అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించారని, కానీ తెలంగాణలోని మాత్రం ఎలాంటి ఉద్యోగ భద్రత లేదని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే వీఆర్ఏ, పంచాయతీ కార్యదర్శులు, ఆర్టీసీని సైతం ప్రభుత్వంలో విలీనం చేసుకుందని, వీరిలాగే తమను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. లేని యెడలా సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ప్రధాన డిమాండ్లు..

ఉద్యోగ భద్రత కల్పిస్తూ.. క్రమబద్ధీకరించాలి. కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలి. పింఛన్, ఈఎస్ఐ సదుపాయం కల్పించాలి. రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్లకు రూ.10 లక్షలు, హెల్పర్లకు రూ.5లక్షలు ఇవ్వాలి. వేతనంలో సగం పింఛన్ నిర్ణయించాలి. ఉద్యోగ విరమణ వయసు 60 ఏళ్లకు పెంచాలి. ప్రమాద బీమా సౌకర్యం రూ.5 లక్షలు చెల్లించాలి. నిబంధనల ప్రకారం పదో తరగతి అర్హత ఉన్న హెల్పర్లకు ప్రమోషన్, సీనియారిటీని బట్టి వేతనంలో వ్యత్యాసం ఉండాలి. ఇంక్రిమెంట్ సౌకర్యం కల్పించాలి. బీఎల్ఓ విధులు రద్దు చేయాలి. అంగన్‌వాడీలకు సంబంధం లేని పనులను చేయించకూడదు.

నోటీసుల కాల్చివేత

తాండూరు రూరల్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు చేస్తున్న సమ్మెపై ప్రభుత్వం సీరియస్ అయింది. సమ్మె విరమించి విధుల్లో చేరాలని అంగన్ వాడీలకు జిల్లా శిశు సంక్షేమ శాఖ నుంచి నోటీసులు పంపించింది. దీంతో ఆగ్రహించిన అంగన్‌వాడీలు సీడీపీఓ కార్యాలయం ఎదుట నోటీసులను దహనం చేశారు. తమ సమస్యలు పరిష్కరించేంత వరకు సమ్మె విరమించేది లేదని స్పష్టం చేశారు.



నోటీసులు తగలబెడుతున్న అంగన్‌వాడీలు

కార్మికుల సంక్షేమానికి నిరంతరం కృషి

సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్

షాబాద్: కార్మికుల సంక్షేమానికి సీఐటీయూ నిరంతరం కృషి చేస్తుందని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్, తాళ్లపల్లి సర్పంచ్ పెంటయ్య తెలిపారు. ఆదివారం మండలం పరిధి తాళ్లపల్లిలో సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్మికుల సంక్షేమం కోసం పాలకవర్గాలపై పోరాటం చేస్తూనే, కార్మికుల హక్కులను సాధించిందని పేర్కొన్నారు. కార్మికుల సంక్షేమం కోసం సీఐటీయూ ముందుండి పోరాటం చేస్తుందని చెప్పారు. ఆరుకోట్ల 20లక్షల మందితో దేశంలో అతిపెద్ద కార్మిక సంఘంగా పేరు ఉందని చెప్పారు. కార్యక్రమంలో తాళ్లపల్లి ఉపసర్పంచ్ విజయ, మాజీ ఉపసర్పంచ్ బాస నర్సింహులు, మండల నాయకులు నర్సింహ, గ్రామ పంచాయతీ యూనియన్ మండల అధ్యక్షుడు సత్తయ్య, ఉపాధ్యక్షుడు నర్సింహ, లక్ష్మయ్య, గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, కార్మికులు తదితరులు ఉన్నారు.



సీఐటీయూ జెండాను ఆవిష్కరిస్తున్న దేవేందర్, పెంటయ్య తదితరులు

కలిసి కట్టుగా ఉంటేనే సమస్యల పరిష్కారం

చేవెళ్ల: కార్మికులంతా కలిసి కట్టుగా ఉంటనే సమస్యలు పరిష్కారమవుతాయని చేవెళ్ల సర్పంచ్ బండారి శైలజ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో సెంట్రింగ్ యూనియన్ కార్యాలయం ప్రారంభించి మాట్లాడారు. సెంట్రింగ్ కార్మికులంతా యూనియన్‌గా ఏర్పడి కార్యాలయం ఏర్పాటు చేసుకోవడం సంతోషకరమన్నారు. భవన నిర్మాణ రంగంలో పనిచేసే వారంతా కలిసి కట్టుగా ఉంటేనే పనులు అవుతాయని చెప్పారు. ఇందులో సివిల్ ఇంజినీర్లు మహేశ్, కరుణాకర్‌రెడ్డి, ఆగిరెడ్డి, సెంట్రింగ్ యూనియన్ మండల అధ్యక్షుడు ఎండీ ముస్తాఫ, ఉపాధ్యక్షుడు కృష్ణ, కార్యదర్శి చంద్రమౌళి, సంయుక్త కార్యదర్శి ఎండీ పాష, ట్రెజరరీ మహేశ్, సభ్యులు నర్సింహులు, అజమ్, పాష, రాఘవేందర్, శేఖర్, రాంరెడ్డి ఉన్నారు.